
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 53 | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-



# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి

**వైసీపీ, జనసేన బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, సీపీఐ, సీపీఎం కార్యదర్శులకు సీఎం చంద్రబాబు లేఖ**

**2029 ఎన్నికల నుంచే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకాలి**

**పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టం**

**ఈ చారిత్రాత్మక విజయాన్ని చేకూర్చడంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలి**

**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 14):**

మహిళా రిజర్వేషన్ 'నారీ శక్తి వందన్'కు పార్లమెంట్‌లో మద్దతుపై రాజకీయ పార్టీల అధ్యక్షులకు, రాష్ట్రంలోని రాజ్యసభ, లోక్ సభ ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం లేఖ రాశారు. 2029 ఎన్నికల నుంచే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకాలని లేఖలో కోరారు. జనసేన అధ్యక్షులు కె పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస రావుకు ముఖ్యమంత్రి లేఖలు రాశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమన్న సీఎం చంద్రబాబు. ఎక్కడ మహిళలను గౌరవిస్తారో...అక్కడ దేవతలు కొలువై ఉంటారని మన భారతీయ ధర్మం చెబుతోంది. దీనికి నిదర్శనమే 'నారీ శక్తి వందన్ అధినియం'. చట్ట సభల్లో మన ఆడబిడ్డలకు 33 శాతం రిజర్వేషన్లు 2029 నుంచే అమల్లోకి వచ్చేలా చట్ట సవరణకు కేంద్రం సంకల్పించింది. ఇందుకోసం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం ఒక గొప్ప ఆలోచనగా నేను భావిస్తున్నాను. ప్రపంచంలో మరే దేశంలోనూ లేని విధంగా చట్టసభల్లో మహిళలకు మూడోవంతు సీట్లు కేటాయించడం ప్రతీ భారతీయుడు గర్వించే సందర్భం. మహిళా సాధికారత దిశగా మనం చేస్తున్న ఆలోచనలు సాకారం అవుతుండటం అభినందనీయం. 'నారీ శక్తీ వందన్ అధినియం' సవరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తరపున, మహిళామూర్తుల తరపున ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. 'నారీ శక్తీ వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుంది. ఈ చారిత్రాత్మక విజయాన్ని చేకూర్చడంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు.

## 45 లక్షల మందికి క్వాంటం.. ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ

**దేశంలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఆవిష్కరణ**

**1 ఎస్,1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్‌లను జాతికి అంకితం చేసిన సీఎం చంద్రబాబు**




**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 14):**

ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఓ సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఆవిష్కతమైంది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన 1 ఎస్, 1 క్యూ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించిన అనంతరం క్వాంటం రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..'ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీ, మేధాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సృష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం



కంప్యూటర్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా ఈ టెస్ట్ బెడ్‌లను ఏర్పాటు చేయటంపై అందరికీ అభినందనలు. భారత తొలి ఓపెన్--యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలతో పాటు అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీ ని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్ ,1 క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకం. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి వేదికగా మారటం సంతోషదాయకం" అని ముఖ్యమంత్రి అన్నారు.

## సంఘ సంస్కర్త బాబా సాహెబ్ అంబేద్కర్

**జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఘన నివాళి**



**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 14):**

భారత రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. అంటరానితనంతో కులవివక్షకు గురై కూడా ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శప్రాయులు. ప్రపంచంలో బలమైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలుస్తోంది అంటే దానికి కారణం ఆయన మనకు ఇచ్చిన రాజ్యాంగం. సమాన అవకాశాలు, హక్కులు అందించి, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనే మన లక్ష్యం కావాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, బాధ్యత కలిగిన పౌరుడిగా ఉండడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి అన్నారు.

హక్కులకు పెద్ద దిక్కు అంబేద్కర్

**ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు మధుసూదనరావు**

మన హక్కులకు పెద్ద దిక్కు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు చల్ల మధుసూదనరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఆ మహనీయుని సేవలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీసీఆర్ సెక్రటరీ ఉమాదేవి, సెక్షన్ ఆఫీసర్ మురళి, కార్యాలయ సిబ్బంది పెద్దిరెడ్డి, మల్లీశ్వరి, సంతోష్ పాల్గొన్నారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

**-- దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**-- వివరాలు వెల్లడించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**



**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 14):**

2027లో వచ్చే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులతో గోదావరి పుష్కరాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. నిడదవోలు నియోజకవర్గంలో - మిగతా 2లో

# 850కి లోక్‌సభ స్థానాలు



దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మూడు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఈనెల 16న లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ 131వ రాజ్యాంగ చట్ట సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లుల ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల సీట్ల పునర్విభజన జరగనుంది. లోక్‌సభలో ప్రస్తుతం 543 స్థానాలు ఉండగా ఆ సంఖ్యను గరిష్టంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాలకు 815 స్థానాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మరో 35 సీట్లు కేటాయించనున్నారు. తర్వాత ఈ చట్ట ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాలపై డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయనుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి స్థాయి వ్యక్తి ఛైర్మన్‌గా ఈ కమిషన్ ఏర్పాటు కానుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఆయన ప్రతినిధి, సంబంధిత రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రతినిధి సభ్యులుగా ఉంటారు. కమిషన్‌కు సహాయ, సహకారాలను అందించేందుకు ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని సభ్యులుగా తీసుకుంటారు. ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే ఐదుగురు లోక్‌సభ సభ్యులు, ఐదుగురు శాసనసభ సభ్యులను సంబంధిత సభల స్పీకర్లు నామినేట్ చేస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే లోక్‌సభ సీట్ల పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఆ గణాంకాల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లు ఖరారు అవుతాయన్న కేంద్రం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా బిల్లులో చేర్చింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో వీలైనంత మేరకు మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించేలా కమిషన్ చర్యలు తీసుకుంటుందని కేంద్రం తెలిపింది. ఈ సీట్లలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉంటాయని స్పష్టం చేసింది. రొటేషన్ విధానంలోనే రిజర్వేషన్లు అమలవుతాయని పేర్కొంది. మహిళలకు రిజర్వ్ చేసిన సీట్లను ఆయా రాష్ట్రాలు లేదా కేంద్రపాలిత ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు రొటేషన్ పద్ధతిలో కేటాయిస్తారని తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజనలో భౌగోళిక సమగ్రత, పరిపాలనా సరిహద్దులు, రవాణా సౌకర్యాలు వంటి అంశాలను డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందని కేంద్రం వెల్లడించింది.

కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును సులభతరం చేసేందుకు ఉద్దేశించిన కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు-2026'ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ బిల్లు ద్వారా అసెంబ్లీలు ఉన్న ఢిల్లీ, జమ్ముకశ్మీర్, పుదుచ్చేరికి సంబంధించిన 3 చట్టాలను సవరించనున్నారు. గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్ యాక్ట్-1963, గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్-1991, జమ్ముకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019లో సవరణలు చేయనున్నారు. ఆయా శాసనసభల్లో నియోజకవర్గాల పునర్విభజన సహా 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలే లక్ష్యంగా ఈ సవరణలు చేయనున్నారు.

# బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ



బిహార్‌లో కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ పేరు ఖరారైంది. ప్రస్తుత ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయడంతో, బీజేపీ తన బలాన్ని నిరూపించుకుంటూ రాష్ట్ర పగ్గాలను చేపట్టబోతోంది. శాసనసభాపక్ష సమావేశంలో, సమ్రాట్ చౌధరీ తమ నాయకుడిగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం లోక్‌భవన్‌లో ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లుగా సమాచారం. దీంతో బిహార్‌లో సమ్రాట్ శకం మొదలుకానుంది.

243 అసెంబ్లీ స్థానాలున్న బిహార్‌లో ఎన్‌డీఏకు 202 మంది సభ్యుల బలం ఉండగా, అందులో 89 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. నీతీశ్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో పట్నాలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. అందులో సమ్రాట్ చౌధరీ పేరును శాసనసభా పక్ష నేతగా మరో డిప్యూటీ సీఎం విజయ్ సిన్హా ప్రతిపాదించారు. దీంతో ఎమ్మెల్యేలు అందరూ సమ్రాట్ చౌధరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభ పక్ష సమావేశం అనంతరం సమ్రాట్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడానికే బీజేపీ తనకు ఈ అవకాశం ఇచ్చిందని తెలిపారు. సుమారు 30 ఏళ్లుగా రాజకీయ కార్యకర్తగా పని చేస్తున్నారని, కానీ ఇంతకుముందు తనకు ఎలాంటి సిద్ధాంతం లేదని, 2015 నుంచే బీజేపీ కోసం పనిచేస్తున్నాని గుర్తుచేశారు. నీతీశ్ కుమార్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఎలా నడపాలి, బిహార్‌లో సుపరిపాలన ఎలా నెలకొల్పాలి, ప్రజాస్వామ్యానికి ఏది మంచిదనే అన్ని చెప్పారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత భారత్ దార్శనికత, నీతీశ్ కుమార్ సుసంపన్నమైన బిహార్‌ను ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

**'బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు ఓ అవకాశం'**

నూతన సీఎంగా ఎన్నికైన అనంతరం సమ్రాట్ చౌధరీ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. 'బీజేపీ నాయకుడిగా బాధ్యతను అప్పగించి, నాపై విశ్వాసం ఉంచినందుకు పార్టీ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇది నాకు కేవలం ఒక పదవి మాత్రమే కాదు. బిహార్ ప్రజలకు సేవ చేసేందుకు, వారి నమ్మకాన్ని, కలలను సాకారం చేసేందుకు లభించిన ఒక పవిత్రమైన అవకాశం. సంపూర్ణ అంకితభావం, నిబద్ధత చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరి అంచనాలకు అనుగుణంగా నడుచుకుంటానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నా. ప్రధాని మోదీ, నాయకత్వంలోనూ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ గారి మార్గదర్శకత్వంలోనూ బిహార్‌ను అభివృద్ధి, సుపరిపాలన సంపన్నతలో కొత్త శిఖరాలకు చేర్చడానికి నేను నిరంతరం కట్టుబడి ఉంటాను. మీ ఆప్యాయత, ఆశీస్సులు, సహకారమే నా అత్యంత గొప్ప బలం' అని సమ్రాట్ చౌధరీ పోస్ట్‌లో రాసుకొచ్చారు.


**సమ్రాట్ రాజకీయ ప్రస్థానం**

బిహార్ రాజకీయాల్లో అత్యంత కీలక నేతగా ఎదిగిన నాయకుడు సమ్రాట్ చౌధరీ. కుష్వాహా సామాజికవర్గానికి చెందిన బలమైన నాయకుడిగా, బీజేపీకి ఓబీసీ ముఖచిత్రంగా ఆయన గుర్తింపు పొందారు. ఆయన తండ్రి శకుని చౌధరీ ఏడుసార్లు ఎమ్మెల్యే, ఎంపీగా పని చేశారు. తల్లి పార్వతీ దేవి తారాపూర్ నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. 57 సంవత్సరాల సమ్రాట్ చౌధరీ సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన సమ్రాట్ చౌధరీ, అసెంబ్లీ ఎన్నికలకు మొత్తం ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. ప్రస్తుతం తారాపూర్ నియోజకవర్గానికి బీజేపీ ఎమ్మెల్యేగా ప్రాతనిధ్యం వహిస్తున్నారు.

**మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు**

రాజకీయ జీవితంలో సమ్రాట్ చౌధరీ మూడు ప్రధాన పార్టీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. లాలూప్రసాద్ యాదవ్?కు చెందిన ఆర్‌జేడీలో 1990లలో సమ్రాట్ రాజకీయ జీవితం ప్రారంభించారు. 1999లో రబ్రీ దేవి ప్రభుత్వంలో అతితక్కువ వయస్సులో వ్యవసాయ మంత్రిగా పనిచేశారు. అయితే వయస్సుకు సంబంధించి చెలరేగిన వివాదాల కారణంగా ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. 2014లో జేడీయూలో చేరిన సమ్రాట్, ఆ పార్టీలో చీలిక తెచ్చి తిరుగుబాటు నేతగా నిలిచారు. తర్వాత 2018లో కాషాయ కండువా కప్పుకున్న ఆయన, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2023లో రాష్ట్ర అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు నిర్వహించారు. 2021--22లో నీతీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్?డీయే ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2025 ఎన్నికల తర్వాత మరోసారి ఉపముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమ్రాట్, హోంశాఖ వ్యవహారాలను సైతం చక్కబెట్టారు.

# ఆర్టికల్ 370 రద్దు తర్వాత పూర్తిగా అమల్లోకి రాజ్యాంగం



డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆశయాల మేరకు రాజ్యాంగ గౌరవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత దేశవ్యాప్తంగా రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిందని కొనియాడారు. మంగళవారం ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'ఈ రోజు అంబేడ్కర్ జయంతి. ఆయనకు నేను హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నా. అంబేడ్కర్ సామాజిక న్యాయానికి జీవితాంతం పోరాడారు. అదే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. మౌలిక వసతులు, పరిశ్రమల అభివృద్ధి ద్వారా సమగ్ర ప్రగతి సాధ్యం అవుతుంది. ఆర్టికల్370 రద్దు తర్వాత రాజ్యాంగం పూర్తిగా అమల్లోకి వచ్చింది. మావోయిస్టు ప్రభావిత జిల్లాలు కూడా ఇప్పుడు రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్నాయి. ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలని మన రాజ్యాంగం మన నుంచి ఆశిస్తోంది. ఉత్తరాఖండ్ దీనిని ముందుకు తీసుకువెళ్లి దేశానికి ఒక మార్గాన్ని చూపింది' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'2029 నుంచే అమలు కావాలి'**

నాలుగు దశాబ్దాల నిరీక్షణ తర్వాత పార్లమెంట్? నారీశక్తి వందన్ అదినియం ఆమోదించిందని ప్రధాని మోదీ తెలిపారు. 'మన సోదరీమణులు, అడబిడ్డల సంక్షేమం, రక్షణ, ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం అనేది డబుల్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యాల్లో ఒకటి. శాసనసభలు, లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. అన్ని పార్టీలు ముందుకొచ్చి ఈ గొప్ప బిల్లుకు మద్దతు ఇచ్చాయి. మహిళలకు లభించిన ఈ హక్కు అమల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. 2029లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతూ ఉంటాయి. 2029 నుంచే ఈ రిజర్వేషన్లు అమలు కావాలి. ఇది దేశంలో ప్రతీ సోదరి, ఆడవిడ్డ కోరిక. మాతృశక్తి ఆకాంక్షను గౌరవిస్తూ ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో చర్చలు జరుగుతాయి. మహిళలకు సంబంధించిన ఈ పనిని అన్ని పార్టీలు కలిసి ఏకాభిప్రాయంతో పూర్తి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**దేవభూమిని శుభ్రంగా ఉంచండి : ప్రధాని మోదీ**

హరిద్వార్‌లో జరగబోయే కుంభమేళాను వైభవోపేతంగా, దివ్యంగా, పరిశుభ్రంగా నిర్వహించాలని కూడా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్ సీసాల కుప్పలు, చెత్తా చెదారం దేవభూమి పవిత్రతకు హాని కలిగిస్తున్నాయి. అందువల్ల, మన పుణ్యక్షేత్రాలైన దేవభూమి ప్రదేశాలను పరిశుభ్రంగా, అందంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా కూడా జరగనుంది. ఈ విశ్వాస సంగమాన్ని దివ్యంగా, వైభవంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మనం అన్ని విధాలా కృషి చేయాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**'ఏడాది పొడవునా టూరిజం అవసరం'**

ఉత్తరాఖండ్?లో 12 నెలల పర్యటకం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా శీతాకాలంలో కూడా పర్యటకులను ఆకర్షించేలా రాష్ట్రం ముందుకు వస్తోందని చెప్పారు. వింటర్ టూరిజం, వింటర్ స్పోర్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ఉత్తరాఖండ్ ప్రముఖ కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రధాని తన 2023 పర్యటనలో కైలాస్, ఓం పర్వత్ సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి నుంచి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచిందని తెలిపారు. ఉత్తరాఖండ్ సహజ అందాలను, పవిత్రతను కాపాడితేనే పర్యటకం దీర్ఘకాలంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్ వల్ల ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం ఆరు గంటల నుంచి సుమారు 3 గంటలకు తగ్గనుంది. 213 కిలోమీటర్ల పొడవైన 6 వరుసల ఎకనామిక్ కారిడార్‌ను 12వేల కోట్లతో నిర్మించారు. మొదట సహారన్‌పూర్‌లో ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా నిర్మించిన ఎలివేటెడ్ సెక్షన్‌లో వన్యప్రాణుల కారిడార్‌ను ప్రధాని పరిశీలించారు. సహారన్‌పూర్, డెహ్రాడూన్ వీధుల్లో రోడ్ షో నిర్వహించారు.డెహ్రాడూన్ సమీపంలోని మా దత్ కాళీ ఆలయంలో ప్రధాని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ద్వారా జరుగుతున్న అభివద్ధి పనుల వివరాలను ఆరా తీసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. వివరాలను మంత్రి దుర్గేష్ వెల్లడించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అదేవిధంగా నిడదవోలు నియోజకవర్గంలో గ్రామీణ అభివద్ధి, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పలు పనులు చేపట్టినట్లు, వాటి పురోగతిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు వివరించినట్లు మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్రమంలో నిడదవోలు అభివద్ధికి సహకరిస్తున్నందుకు డిప్యూటీ సీఎం కి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు

ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా, 40 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది. ఘటన జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నిం చగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

## రాజ్యాంగాన్ని బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు ధ్వంసం చేస్తున్నాయి

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో రాజకీయాలు వేడెక్కాయి. అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ ఆరెస్సెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్వేషంతో నిండిన బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనలు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు. కాషాయ పార్టీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శించారు. బంగాల్‌లోని ఉత్తర్‌దినాజ్‌పూర్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "బంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పోరులో బీజేపీ పార్టీ ఉంది. వారిది విద్వేషపూరిత భావజాలం, హింసను ప్రేరేపిస్తారు. వారి ప్రధానమంత్రి కూడా ఒక రాజీ పడిన వ్యక్తి, అలాంటి వారి గురించి మాట్లాడాల్సిన అవసరమే లేదు. అదేవిధంగా, బంగాల్‌లో టీఎంసీ పార్టీ కూడా ఉంది. ఈ టీఎంసీ పార్టీయే బీజేపీకి దారి చూపిస్తోంది. ఒకవేళ టీఎంసీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించి ఉంటే, మీకు సరైన ఉపాధిని కల్పించి ఉంటే, ద్వేషాన్ని వ్యాప్తి చేయకుండా ఉండి ఉంటే, అప్పుడు ఇక్కడ బీజేపీకి చోటే ఉండేది కాదు. అసలు బంగాల్‌లో బీజేపీ ఎక్కడా కనిపించేది కూడా కాదు."

**'బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది'**

మరోవైపు, బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని రాహుల్? గాంధీ ధ్వజమెత్తారు. బంగాల్‌లో బీజేపీ ఓటు చోరీ చేసేందుకు సీఎం మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వమే అవకాశం ఇచ్చిందని దుయ్యబట్టారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన టీఎంసీ, ఆ పని చేయలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఐదు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని సీఎం మమతా వాగ్దానం చేశారని, అయితే, రాష్ట్రంలో మాత్రం 84 లక్షల మంది యువత నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కూడా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా బంగాల్‌లో చాలా మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత తొలగింపునకు గురైన వారి పేర్లను తిరిగి చేర్చుతామని హామీ ఇచ్చారు. కాషాయ శిబిరానికి వ్యతిరేకంగా నిలబడి ఓడించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని రాహుల్? పేర్కొన్నారు.

**బంగాల్‌లో నిరుద్యోగానికి టీఎంసీయే కారణం**

అదేవిధంగా, బంగాల్‌లో నిరుద్యోగానికి టీఎంసీయే కారణమని రాహుల్? గాంధీ ఆరోపించారు. టీఎంసీ బంగాల్‌లోని అన్ని పరిశ్రమలను మూసివేసి, సిండికేట్ల ద్వారా రాష్ట్రాన్ని నడుపుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా శారదా, రోజ్ వ్యాలీ కేసుల వంటి పాంజీ స్కామ్‌లను ప్రస్తావించారు. టీఎంసీ సభ్యులు నడుపుతున్న సిండికేట్లు, లంచగొండితనం ద్వారా లబ్ధి పొందుతున్నాయని ఆరోపించారు. టీఎంసీ హింసకు పాల్పడుతోందని, తప్పుడు వాగ్దానాలు చేస్తోందని కూడా రాహుల్ విమర్శించారు. ఇదిలా ఉండగా, బంగాల్‌లో కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఐదు హామీల గురించి రాహుల్ గాంధీ ప్రస్తావించారు. మెరుగైన ఆరోగ్య సేవలు, విద్య, రైతులకు మద్దతు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా, జిల్లా ఆసుపత్రుల్లో ఉచిత డయాలసిస్, క్యాన్సర్ చికిత్సను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వరకు, మహిళలకు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. అదనంగా, పాఠశాలల్లో ఏఐ, ఆంగ్లంలో విద్య కూడా అందిస్తామని తెలిపారు. రైతులకు ఏటా రూ.15,000 సహాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఆయన ఇంకా హామీ ఇచ్చారు.

## హైవేలపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల ఫీజుకు సంబంధించి కొత్త రూల్స్

**- ఏప్రిల్ 15 నుంచి నిబంధనలు అమల్లోకి!**

జాతీయ రహదారులపై ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాల నిబంధనల అమలును పటిష్టం చేయడం, హేతుబద్ధమైన ఫీజులు వసూలును నిర్ధారించటమే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల ఫీజు (రేట్ల నిర్ధారణ, వసూలు) నాలుగో సవరణ నిబంధనలు 2026ను నోటిఫై చేసింది. ఈ సవరించిన నిబంధనలు 2026 ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

**కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం**

నిర్దేశించిన లోడు పరిమితులను పాటించడాన్ని ప్రోత్సహించడం, రహదారి మౌలిక సదుపాయాలను పరిరక్షిస్తూ రోడ్డు భద్రతను పెంచడం ఈ సవరణ లక్ష్యమని కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరించిన రుసుము విధానం ప్రకారం, ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలకు లోడు శాతాన్ని బట్టి రుసుము విధిస్తామని స్పష్టం చేసింది. 10 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ఎలాంటి ఓవర్ లోడ్ రుసుము విధించమని పేర్కొంది. అయితే 10-40 శాతం వరకు ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలకు ప్రాథమిక రుసుముకు రెట్టింపు ఫీజును విధిస్తామని వెల్లడించింది. 40

# శ్రామిక లోకానికి 'అక్షయపాత్ర'.. బాల్యానికి 'ఆరోగ్య వనం

- నేడు రాప్తాడులో అన్నా క్యాంటీన్, చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం
- పాల్గొననున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల ఇన్చార్జ్ ధర్మవరపు మురళి

**రాప్తాడు అంకుశం న్యూస్ ఏప్రిల్ 14:** మండల కేంద్రం రాప్తాడు నేడు సరికొత్త అభివృద్ధి హంగులను సంతరించుకోనుంది. నిరుపేదలు, శ్రామిక లోకానికి ఆకలి తీర్చే అక్షయపాత్ర 'అన్నా క్యాంటీన్', చిన్నారుల శారీరక దారుఢ్యం కోసం ఏర్పాటు చేసిన 'పరిటాల రవీంద్ర చిల్డ్రన్స్ పార్క్' నేడు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి మండల ఇన్చార్జ్ ధర్మవరపు మురళి విచ్చేసి వీటిని ప్రజలకు అంకితం చేయనున్నారు. ?నాడు "ప్రజలే దేవుళ్లు - సమాజమే దేవాలయం" అనే మహోన్నత నినాదంతో అధికారంలోకి వచ్చిన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, పేదల కడుపు నింపేందుకు రూ.2కే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు అదే దారిలో, మార్కెట్‌లో పెరిగిన ధరల దృష్ట్యా సీఎం చంద్రబాబు నాయుడు పేదలకు రూ.5 కే భోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు.

**శ్రామిక శక్తికి 'అక్షయపాత్ర'.. బాల్యానికి 'ఆరోగ్య వనం'!**

సమాజ గమనంలో కీలకమైన వ్యవసాయదారులు, శ్రామికులు మరియు కర్షక వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దింది.





**జాతీయ రహదారి ప్రయాణికులకు, వాహన చోదకులకు వరంలా మారనుంది.**

44వ జాతీయ రహదారి పక్కనే అన్నా క్యాంటీన్ ఉండటంతో, సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు, వాహన చోదకులకు, లారీ క్లీనర్లకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం లభించడం వారికి పెద్ద ఊరట.

**భవన నిర్మాణ, ఆటోనగర్ శ్రామికులకు ఆసరా:**

రాప్తాడులో అధిక సంఖ్యలో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు, ఆటోనగర్‌కు పనుల నిమిత్తం వచ్చే మెకానిక్కులకు ఈ క్యాంటీన్ ఒక గొప్ప వరంగా మారనుంది.

**పస్తులు లేని శ్రామిక లోకం:**

పొలం పనుల కోసం తెల్లవారుజామునే ఇళ్లను వదిలి వచ్చే రైతు కూలీలు ఆకలితో అలమటించకూడదనే సంకల్పంతో ఈ క్యాంటీన్‌ను అందుబాటులోకి తెచ్చారు. కేవలం రూ.5 కే భోజనం అందించడం ద్వారా శ్రామికుడి గౌరవాన్ని కాపాడడమే ఈ పథకం పరమావధి.

**దృఢమైన రేపటి పౌరులు**

కేవలం ఆటలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంత చిన్నారులు శారీరక వ్యాయామం ద్వారా దృఢంగా తయారవ్వాలనే లక్ష్యంతో 'పరిటాల రవీంద్ర చిల్డ్రన్స్ పార్క్' రూపుదిద్దుకుంది. కర్షక బిడ్డలకు సైతం నగర స్థాయి వసతులు అందాలన్న ఉద్దేశంతో, ఆధునిక వ్యాయామ పరికరాలు మరియు సుందరమైన ఆట స్థలాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ?ఈ రెండు సౌకర్యాలు అందుబాటులోకి రావడం పట్ల మండల రైతాంగం, వాహన చోదకులు, మెకానిక్కులు, కార్మికులు మరియు సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాజేష్ నాయుడు కుటుంబానికి అండగా ఉంటాం.

- కుటుంబ సభ్యున్ని కోల్పోయాం అని కన్నీళ్లు పెట్టిన నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.
- ఈ రోడ్డు ప్రమాదంలో నమ్మకస్తుడిని కోల్పోయాం అన్న భాధగా ఉంది.
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి.

**అంకుశం న్యూస్ నంద్యాల ఏప్రిల్ 14:** మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి పి ఏ గా గత 20 ఏళ్లుగా ఉంటున్న రాజేష్ నాయుడు (39) సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో బైరెడ్డి రాజశేఖరరెడ్డి డ్రైవర్ బ్రహ్మంకు తీవ్ర గాయాలు కాగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బైరెడ్డి పి ఏ రాజేష్ నాయుడు, బైరెడ్డి డ్రైవర్ బ్రహ్మంలు సోమవారం మోటార్ బైక్ పై రాజేష్ నాయుడు అమ్మమ్మ (అవ్వ గారి ఊరు) గూడూరు గ్రామం లోని జాతరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి 11.20 గంటల సమయంలో కె. నాగలాపురం గ్రామంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద మోటారు బైక్ స్లో చేయడం, అప్పటికే వెనుక లోడ్ తో కర్నూలు వైపు వస్తున్న లారీ వేగంగా వచ్చి మోటారు బైక్ ను ఢీ కొట్టడం వల్ల ఇద్దరు క్రింద పడడం, బ్రహ్మం ఒక వైపు క్రింద పడగా, రాజేష్ నాయుడు లారీ క్రింద పడడం వల్ల అక్కడికక్కడే మృతి చెందారు. సి. బెళగల్ మండలం బురాన్ దొడ్డి గ్రామానికి చెందిన రాజేష్ నాయుడు పాత్రికేయుడుగా పనిచేస్తూ బైరెడ్డి రాజశేఖరరెడ్డి కి నమ్మకస్తుడిగా మారి, విలేకరి వృత్తి మానుకొని బైరెడ్డి పి ఏ గా ఉంటున్నారు.

రోడ్డు ప్రమాదం తెలుసుకున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తీవ్ర ఆందోళనకు గురై ఉటా ఉటినా ఢిల్లీ నుంచి వచ్చి మంగళవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన రాజేష్ నాయుడు భార్య, ఇద్దరు పిల్లలను అతుక్కొని కన్నీళ్లు పెట్టి మీకు తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా మా కుటుంబంతో కలిసి ప్రయాణిస్తూ, నాన్నకు నాకు చేదోడువాదోడుగా ఉంటున్న రాజేష్ నాయుడు రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మనలను విడిచి వెళ్లిపోయారన్న వార్త నన్నెంతో కలచివేసిందని, ఈ లోటు మాటల్లో చెప్పలేనిదని, ఇది నా కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లే ఉందని, ఆయన లోటు ఎప్పటికీ భర్తీ కాలేనిదని, దేవుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ... వారి కుటుంబానికి ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం ఇవ్వాలని కోరుకుంటున్నానన్నారు.



**మంచి నమ్మకస్తుడిని - మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి.**

గత 20 ఏళ్లుగా తనకు పి ఏ గా పనిచేస్తూ తన కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మంచిగా, అత్యంత నమ్మకంగా రాజేష్ నాయుడు ఉండేవారని, నాయుడు మరణం ఎంతో భాధేస్తోందని, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, వారిని తాము ఆధుకుంటామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి భరోసా ఇచ్చారు. రాత్రి వేళల్లో బైక్ ప్రయాణం మంచిది కాదని తాను పదే పదే చెప్పేవారమని, తనను, తన కుటుంబాన్ని ఈ ప్రమాద సంఘటన తీవ్ర కలిసి వేసిందన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, మృతుడు రాజేష్ నాయుడు సమీప బంధువు, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు కూడా ఆసుపత్రి వద్ద నాయుడు పార్థివదేహానికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి వెంట వెళ్లి నివాళులు అర్పించారు.

## ఏప్రిల్ 18,19 తేదీల్లో గుంతకల్లు లో ఏ ఐ టి యు సి జిల్లా 12 వ మహాసభలు

- ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రాజారెడ్డి




**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 14 :** కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైకరి మార్చుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు, ఏఐటియుసి అనంతపురము జిల్లా 12 వ మహాసభలు ఏప్రిల్ 18,19 తేదీల్లో గుంతకల్లు లో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ రోజు బిటి పక్కిరప్ప భవన్ నందు సమావేశం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కులుగా భావించే కార్మిక చట్టాలను సవరణలు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన లేబర్ కోడ్స్ తీసుకొచ్చాయన్నారు,వంద సంవత్సరాలు క్రితమే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రూపుమాపడాన్ని ఏఐటియుసి గా వ్యతిరేకిస్తూ ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వాలు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు,వామపక్ష పోరాటాలు దెబ్బతీయడం ఎవరితరం కాదన్నారు, కనీస వేతనాలు 26000 ఇవ్వాలన్నారు, హమాలీ ఆటో వీధివిక్రయదారులకు ప్రత్యేక సంక్షేమ చట్టం చేయాలన్నారు, ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు, సంఘటిత ,అసంఘటిత కార్మికుల సమస్యలపై ఏప్రిల్ 18,19 న గుంతకల్లులో జరిగే ఏఐటియుసి 12 వ జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు,ఈ మహాసభల జయప్రదానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి,హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి గౌస్,గుంతకల్లు పట్టణ అధ్యక్ష,కార్యదర్ సురేష్, ఈశ్వరయ్య, నాయకులు మల్లయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గారి ఆశయాలు స్ఫూర్తిగా తీసుకుందాం

- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఏప్రిల్ 14:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలు కనుగుణంగా ఆయన స్ఫూర్తితో మనందరం పనిచేయాలని నేటి తరానికి ఆయన ఒక మార్గదర్శి అని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారుభారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ శ్రీ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి పి. జగదీష్, పాల్గొని డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి స్మరించారు. ఈ సందర్భంగా ఎస్.పి జగదీష్ మాట్లాడుతూ, అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు పునాది వేసిన మహనీయుడు అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అంబేద్కర్ గారి ఆశయాలను అనుసరిస్తూ సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ ఐ లు పవన్ కుమార్ , రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మీనారాయణ, ఆర్ ఎస్ ఐ లు బాబ్జాన్, సురేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మజ్జిగ కేంద్రం లో మంత్రి సత్య కుమార్ యాదవ్

**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 14:** ధర్మవరం లో డా. బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సందర్భంగా కళా జ్యోతి సర్కిల్ వద్ద పట్టణ పారిశుద్ధ కార్మిక సంఘం వారు ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం మంత్రి సత్య కుమార్ యాదవ్ సందర్శించారు నిర్వాహకులు చల్లటి మజ్జిగ ఎర్రటి ఎండ లో ఏర్పాటు చేయడం పట్ల మంత్రి సత్య కుమార్ మనసారా అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆయన తో బాటు బీజేపీ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.ఇంకా ఈ కార్యక్రమం లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిఐట?యూ జిల్లా నాయకులు ఎస్ హెచ్ బాష, సీపీయం శేషంపల్లి మారుతీ, మున్సిపల్ పారిశుద్ద కార్మిక సంఘం అధ్యక్షులు కార్యదర్శి మేకల బాబు, ముకుంద, ట్రెజరర్ లక్ష్మి ఓబిలేసు రెగ్యులర్ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు. ఎండలో వీరు ప్రజలు అందరికీ మజ్జిగ పంపిణీ చేయడం విశేషం అన్నారు.





## "ధర్మవరం " అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ !

**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 14:** ధర్మవరం నియోజకవర్గంలోని కళాజ్యోతి సర్కిల్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ..సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల కోసం జీవితాంతం పోరాడిన అంబేద్కర్ గారి ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం అంబేద్కర్ గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.అని అన్నారు.ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ సాకే ఓబిలేసు,టీడీపీ నాయకులు కమతం కాటమయ్య,పట్టణ అధ్యక్షులు పరిసె సుధాకర్, బీమనేని మహేష్,బీజేపీ మైనార్టీ నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.



## రెడ్డి సంక్షేమంపై ఎస్ ఆర్ ఎమ్ బిల్డర్స్ శివారెడ్డి ఉదారత

--- రెడ్డి కళ్యాణమండప కాంపౌండ్ వాల్ నిర్మాణ ఖర్చు రూ.20 లక్షలకు ఓకే

--- రెడ్డి సంఘం ప్రతినిధుల ప్రశంసలు

**అంకుశం న్యూస్అనంతపురం ఏప్రిల్ 14:** అనంతపురం నగరంలో మెజార్టీ కులాలకు కళ్యాణ మండపాలు ఉన్నాయి... అయితే రెడ్డి కళ్యాణమండపం లేకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తూ వస్తోంది... కొంతమంది రెడ్డి ప్రతినిధులు దాదాపు 20 ఏళ్లుగా రెడ్డి సంక్షేమం కొరకు కళ్యాణ మండపం నిర్మించాలని ప్రయత్నాలు చేసినా అవి సఫలీకృతం కాలేదు.... రెడ్డి కళ్యాణమండపం నిర్మించాలని నగరంలోని రెడ్డి ప్రముఖులు సంకల్పించారు... వెంటనే రంగంలోకి దిగిన వారు జిల్లావ్యాప్తంగా నిర్మాణ రంగంలో పేరొందిన ఎస్ఆర్ఎం బిల్డర్స్ అధినేత... యువకుడు.. బెడుదూరి శివారెడ్డిని సంప్రదించారు... రెడ్డి సంక్షేమం కోసం మంచి కార్యక్రమాన్ని సంకల్పించారని వారికి శివారెడ్డి కితాబు ఇచ్చారు... అలాగే తన వంతుగా ఆయన మరోసారి ఉదారతను చాటుకున్నారు... రెండు ఎకరాల్లో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి 20 లక్షల వ్యయం అయ్యే కాంపౌండ్ వాల్ ను తానే సొంత ఖర్చుతో నిర్మాణానికి అంగీకరించినట్లు రెడ్డి ప్రతినిధులు తెలిపారు.... ఈ సందర్భంగా వారు శివారెడ్డిని శాలువా కప్పి సన్మానించారు...




## శ్రీ సత్యసాయి జిల్లాలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి ఏప్రిల్ 14:** శ్రీ సత్య సాయి జిల్లాలోనిపుట్టపర్తి లోని జానకి రామయ్య ఫంక్షన్ హాల్ నందు భారత రత్న లిడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలనులి ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భారద్వాజ్, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.విద్యార్థులు అంబేద్కర్ గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.జిల్లాలోని ఎస్సీ ఆవాస ప్రాంతాలలో స్మశాన వాటికల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా వెంగళమ్మ చెరువు గ్రామానికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్‌ను ఎంపిడిఓకు అందజేశారు.2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ కనబరిచిన సాంఘిక సంక్షేమ వసతి గృహ మరియు గురుకుల విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమం లో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ,పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతి ,జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి కే. మోహన రామ్,డిఆర్‌డిఎ పిడి నరసయ్య,వివిధ శాఖల డైరెక్టర్, లు,కుల సంఘ నాయకులు పాల్గొన్నారు

# అంబేద్కర్ జీవితంస్ఫూర్తిదాయకం

## – అనంతలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**అంకుశం న్యూస్ అనంతపురము, ఏప్రిల్ 14:** నవ భారత నిర్మాత, భారతరత్న శ్రీ డా.బి.ఆర్.అంబేద్కర్ గారి 135 వ జయంతి వేడుకల సందర్భంగా నేటి మంగళవారం ఉదయం అనంతపురము నగరంలోని జిల్లా పరిషత్ డీపీఆర్సి సమావేశ మందిరం నందు నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అనంతపురము అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్,ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, ఎస్సీ కమిషన్ సభ్యురాలు రామాంజమ్మ, జిల్లా, డివిజన్ ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ అంకె ఈశ్వరయ్య, దూదేకుల సంఘం సభ్యులు ఇమామ్ హుస్సేన్, విశ్వ కర్మ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కుర్లపల్లి రంగాచారి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశర్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పలు కుల సంఘాల మరియు కార్మిక, మహిళా సంఘ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలనతో శ్రీ డా.బి.ఆర్.అంబేద్కర్ గారి చిత్ర పటానికి పూల మాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ ముందుగా అందరికీ డా. బి.ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ భవనం, బిసి స్టడీ సర్కిల్, ఎస్సీ/ఎస్టీ (SC/ST) సబ్-ప్లాన్ మరియు హాస్టల్స్ గురించి నోట్ చేసుకున్నాను అని తెలుపుతూ ముఖ్యంగా అంబేద్కర్ భవనానికి సంబంధించి సంఘం నాయకులు





కోరినట్లుగా, మన ఎస్డీఎఫ్ (SDF) నిధుల నుండి కొంత మొత్తాన్ని కేటాయించి, ప్రాథమిక మరమ్మత్తులు ఖచ్చితంగా చేయిస్తానని తెలిపారు. అలాగే బిసి స్టడీ సర్కిల్స్ కోసం కూడా మనం చాలా కాలంగా కృషి చేస్తున్నామనీ, దీనికి సంబంధించిన అంచనాలను కూడా ప్రభుత్వానికి పంపించడం జరిగిందనీ అన్నారు. అనుమతి రాగానే దానిని పూర్తి చేసే అవకాశం ఉంటుందనీ, దీనిపై ఫాలో-అప్ చేసి, పనులు పూర్తయ్యేలా చూస్తామను అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ఎస్సీ/ఎస్టీ వర్గాలకు అందించుటకు తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెచ్ఓడీలతో (సుమారు) దాదాపు నాలుగు, ఐదు సార్లు సమావేశాలు నిర్వహించాననీ నిబంధనల ప్రకారం ఎస్సీ/ఎస్టీ సబ్-ప్లాన్ కింద దాదాపు 6% ఎస్టీలకు, 15% ఎస్సీలకు ప్రతి పథకంలో లబ్ధి చేకూరాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయనీ, జిల్లాలో దీనిని ఖచ్చితంగా అమలు చేయడానికి ప్రతి నెలా సమీక్షలు నిర్వహిస్తున్నామనీ, కొన్ని శాఖల్లో ఇంకా ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరడం లేదనీ, కానీ రాబోయే రోజుల్లో దీనిని మరింతగా పర్యవేక్షించి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామనీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, ఇన్చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, డిఆర్ డి ఏ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ, వ్యవసాయ శాఖ జెడి రవికుమార్, డి ఐ పి ఆర్ ఓ బాలకొండయ్య, డ్వామా పిడి సలీం భాష, తదితర వివిధ శాఖ అధికారులు ప్రజా సంఘాల నాయకులు, మహిళ సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాల అనుగుణంగా చంద్రబాబు పాలన

– అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత

– నసనకోటలో అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సునీత

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 14:** అంబేద్కర్ ఆశయాల అనుగుణంగా ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన కొనసాగుతున్నదనిడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి ప్రస్తావన లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ఎక్కడా ఉండదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రామగిరి మండలం నసనకోట పంచాయతీ కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద అందమైన ముగ్గులు వేసి ఒక పండుగ వాతావరణం తలపించేలా చేసిన మహిళలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ముగ్గులతో అందర్నీ ఆకర్షించిన మహిళలకు చీరలు బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఈరోజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని వర్గాల్లో సముచిత స్థానం దక్కుతోందంటే అది ఒక్క అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనేనన్నారు. ఒక పేద కుటుంబంలో పుట్టిన ఆయన దేశానికే దిక్సూచిగా మారారన్నారు. చంద్రబాబు





రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రి అయిన రోజు నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తగిన ప్రాధాన్యత కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో కూడా చాలామంది ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ సమావేశం జరిగినా.. అంబేద్కర్ గురించి మాట్లాడకుండా అది పూర్తి కాదన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని విమర్శలు చేశారు. ఎంతోమంది ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగాయని హత్యలు జరిగినా ఏ రోజు గత ప్రభుత్వంలో పట్టించుకోలేదన్నారు. అందుకే ఆ ప్రభుత్వాన్ని 11 స్థానాలకు పరిమితం చేసి మరోసారి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు...

**ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన రూరల్ డిఎస్పి టి.శ్రీనివాసులు**

అనంతపురం డిఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన టి శ్రీనివాసులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. రామగిరి మండలం వెంకటాపురంలోని ఆమె నివాసానికి డిఎస్పి వచ్చారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులుకు ఎమ్మెల్యే సునీత శుభాకాంక్షలు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో పరిస్థితి గురించి ఇరువురు చర్చించుకున్నారు. ప్రస్తుతమున్న శాంతిభద్రతలతో పాటు గతంలో జరిగిన కొన్ని పరిణామాల గురించి చర్చించారు. నియోజకవర్గంలో ప్రశాంతంగా వాతావరణం ఉండాలని ఇందుకు తమవంతుగా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు.

# నియోజకవర్గ వ్యాప్తంగా అంబేద్కర్జయంతి వేడుకల్లో ఘన నివాళులు అర్పించిన మంత్రి సుభాష్

– సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు

– అంబేద్కర్ ఆశయాల సాధనలో ముందుకు సాగుదాం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 14:** భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయానికి ప్రతీక అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, మెయిన్ రోడ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి, జల్లి పేటలోను, జగన్నాయకుల పాలెం,ద్రాక్షారామం, వెంకటాయపాలెంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి పెయ్యల వారి పాలెంలో నిర్మించిన అంబేద్కర్ విగ్రహ షెడ్డును ప్రారంభించిన అనంతరం జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతూ.. .భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాలే ఈ దేశానికి శరణ్యమని అంబేద్కర్ ఏ ఒక్క కులానికో, ఏ ఒక్క జాతికో చెందిన వాడు కాదని అందరివాడుగా అభి వర్ణించారు. అంబేద్కర్ చూపించిన మార్గంలో మనమంతా





నడవాలని హితవు పలికారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్న అంబేద్కర్ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సమ సమాజం కోసం, సమానత్వం కోసం, అంట రానితనం నిర్మూలించడం కోసం, విద్య కోసం, కార్మికుల హక్కుల కోసం పురుషులతో సమానంగా మహిళలు, కార్మికులకు హక్కులు కల్పించడం కోసం, అందరికీ ఓటు హక్కు కల్పించడం కోసం అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలవారు స్వేచ్ఛగా సమానత్వం అనుభవిస్తున్నారంటే అంబేద్కర్ దయ వల్లనేనని మంత్రి సుభాష్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ,టీడీపీ రూరల్ మండలం అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, దళిత సంఘాల నాయకులు, కూటమి పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, కూటమి నాయకులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతికి అంబేద్కర్ ఎనలేని కృషి- ఎమ్మెల్యే నల్లమిల్లి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 14:** మహిళల అభ్యున్నతి కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంతో కృషి చేశారని ఆయన ఆశయానికి తగినట్టుగానే కీర్తిశేషులు నందమూరి తారక రామారావు ఆస్తిలో సమాన హక్కు,స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అనపర్తి కెనాల్ రోడ్, పాతవూరులో గల ఆయన విగ్రహాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే నల్లమిల్లి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మండ రామకృష్ణారెడ్డి,అనపర్తి మండల టిడిపి అధ్యక్షులు,సొసైటీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను),ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు కర్రి దాసు, పులగం బుల్లి రెడ్డి, నల్లా చిన్నారావు,ఒంటిమి సూర్య ప్రకాష్,గార తాతారావు, నూతిక బాబూరావు,ఏఎంసీ చైర్మన్ జుత్తుగసూర్యకుమారి, మాజీ సర్పంచులు గొల్లు హేమ తులసి, గిరడా గంగాభవాని, మాజీ జెడ్పిటిసి కర్రి శేషారత్నం,పోతంశెట్టి సుభాషిణి, ఇంకా పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. అనంతరం నల్లా చిన్నారావు ఆధ్వర్యంలో పాదచారులకు మజ్జిగ వితరణ చేశారు.





## అనపర్తి ఫైర్ స్టేషన్ లో అగ్నిమాపక సేవా వారోత్సవాలు ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 14:** అనపర్తి ఫైర్ స్టేషన్ ఆఫీస్ లో ఏప్రిల్ 14-20 వరకు అగ్నిమాపక సేవల వారోత్సవాలు సందర్భంగా వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం అమరవీరుల స్మారక స్తూపం వద్ద అమరవీరులకు నివాళు లర్పించి తరువాత అనపర్తి ఫైర్ స్టేషన్ ఆఫీస్ లో ఏప్రిల్ 14నుండి20 వరకు అగ్నిమాపక సేవల వారోత్సవాలు సందర్భంగా అగ్నిమాపక వాహనమును జెండా ఊపి ప్రారంభించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల,టౌన్ కూటమి నాయకులు ఎంపిడిఓ మండ రామకృష్ణారెడ్డి, డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, తిరుమల కృష్ణారెడ్డి, పులగం తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జుత్తుగ సూర్యకుమారి, మాజీ సర్పంచులు గొల్లు హేమ తులసి, గిరడా గంగాభవాని, మాజీ జెడ్పిటిసి కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, ఇంకా పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు, అధికారులు,అగ్నిమాపక సిబ్బంది, పాల్గొన్నారు.





## అమర జవాన్ మురళి నాయక్ త్యాగం వెలకట్టలేనిది

– జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఏప్రిల్ 14:** దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ మురళి నాయక్ త్యాగం మరువలేనిదని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ కొనియాడారు. గోరంట్ల మండలం,కల్లితాండాలో నిర్వహించిన మురళి నాయక్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మురళి నాయక్ వంటి వీరులు జిల్లాకే గర్వకారణం.వారి కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.దేశం కోసం ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తిని యువత కొనసాగించాలి. ఈ కార్యక్రమంలో గోరంట్ల తహసీల్దార్ మధు నాయక్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొని అశ్రు నివాలర్పించారు.

## అనపర్తిలో ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సత్తి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 14:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా అనపర్తి నల్ల కాలువ వంతెన వద్ద గల పాతపేటలోని అంబేద్కర్ విగ్రహాలు కి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ...భారత రాజ్యాంగ శిల్పి, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికో, ఒక కులానికో పరిమితమైన నాయకుడు కాదని ఈ దేశం గర్వించదగ్గ మహనీయుడు అని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించి, ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించి అంటరానితనం లేని, వివక్ష లేని సమాజం కోసం ఆయన పడిన తపన వెలకట్టలేనిదని అన్నారు. అంబేద్కర్ ఆశించినట్లుగా సమాజంలో ఉన్నత విలువలను కాపాడటం, పేదలకు, అణగారిన వర్గాలకు అండగా నిలవడమే ఆయనకు మనం ఇచ్చే అసలైన నివాళి అని వ్యాఖ్యానించారు. అనంతరం స్థానిక ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.





ఈ కార్యక్రమంలో అనపర్తి మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి (నేషనల్), రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీ తిరగట్టి శివ, అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఇమ్మంది విజయకుమారి, వైస్ ఎంపీపీ కర్రిదాసు, ఎస్సీ నాయకులు నందికోళ్ల రవికుమార్, విజయరత్నం, సునీల్, ప్రసాదు, ఆశీర్వాదం, అబ్రహం, రమణ, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, మాజీ సర్పంచ్ వారాకుమారి, పొలమూరు మాజీ ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, మాజీ వార్డు సభ్యులు యాసిడ్ రాము, కానూరి కృష్ణ, షేక్ ఇబ్రహీం, కొత్తూరు బుజ్జి, ఏసు, సునీల్ రెడ్డి, వీరయ్య కాపు, సత్తి శ్రీనివాసరెడ్డి, సత్తి పోతారెడ్డి, చింత శ్రీనివాసరెడ్డి, మండ వెంకటరెడ్డి, మల్లిడి బుల్లి వెంకటరెడ్డి, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ పాటుపడాలి..

– వైయస్సార్సీపి రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి.

**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 14:** అంబేద్కర్ ఆశయ సాధనాలకు అందరూ పాటుపడాలని వైఎస్ఆర్సిపి మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద గల విగ్రహానికి చందమూరి నారాయణరెడ్డి తో పాటు వైయస్సార్సీపి నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ వైస్ చైర్మన్ లు, మాజీ చైర్మన్ కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక సంస్కర్త, విద్యావేత్త, ఆర్థిక నిపుణుడు, న్యాయ కోవిదుడు, రాజా నీతిజ్ఞుడు, రాజ్యాంగ ప్రదాత, ప్రగాఢ దేశభక్తుడు అంబేద్కర్ అని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికై అందరూ ఐక్యంగా ఉన్నప్పుడు పరిష్కారం అవుతుందని తెలిపారు. అనంతరం వైయస్సార్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను వారు వివరించారు. అంబేద్కర్ కలలను నిజం చేయాలని తెలిపారు. అసమానతలు లేని సమాజాన్ని సాధించుకుంటేనే సామాజిక న్యాయం సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రశీ శ్రీనివాసరెడ్డి, గజ్జల శివ, గోరకాటి పురుషోత్తం రెడ్డి, దేవరకొండ రమేష్ ,చౌడయ్య ,కత్తే పెద్దన్న, బొమ్మన, సుభాన్ భాష, మేడాపురం వెంకటేష్, చాంద్ బాషాఎస్ పి బాష, రాజశేఖర్ రెడ్డి తో పాటు అధిక సంఖ్యలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

